క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో పూజలు



పూజలందుకుంటున్న వేంకటేశ్వరుడు

శ్రీకాకుళం కల్చరల్ :నగరంలోని డీసీసీబీ కాలనీలో భూ సమేత వేంకటేశ్వరుని ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అష్టోత్తర శతనామాలతో పూజలు, అర్చనలు జరిగాయి. ఆలయ అర్చకులు చామర్తి గోపాలాచార్యుల భక్తుల గోత్రనామాలతో పూజలు చేయించారు.

డిగ్రీ నాలుగో సెమిస్టర్‌లో 87.78 శాతం ఉత్తీర్ణత



ఫలితాలు విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్, సీఓఈ, అధ్యాపకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాల నాలుగో సెమిస్టర్ ఫలితాలను ప్రిన్సిపాల్ డాక్టర్ కింతలి సూర్యచంద్రరావు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టి.ఆదిలక్ష్మి శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి నాలుగో సెమిస్టర్‌లో 84.78 శాతం ఫలితాలు సాధించినట్టు పేర్కొన్నారు. గ్రూపులవారీగా బీఏలో 84.69 శాతం, బీకాంలో 89.81 శాతం , బీఎస్సీలో 82.35 శాతం ఫలితాలు సాధించినట్టు చెప్పారు. మెరుగైన ఫలితాల సాధనకు కృషిచేసిన అధ్యాపకులను, విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పైడి శంకరనారాయణ, అకడమిక్ కోఆర్డినేటర్ చింతాడ కృష్ణారావు, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.పద్మావతి, డిప్యూటీ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ పీఎస్ కనకదుర్గ, వై.ప్రశాంతి, సీహెచ్ కాత్యాయని, కె.సంతోష్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సేవలే గుర్తింపునిస్తాయి



స్వామి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్ : ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ అనేది సహజమని ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ హనుమంతు అమరసింహుడు అన్నారు. శనివారం ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటో డిపో గ్యారేజ్‌లో సూపరింటెండెంట్‌గా సీహెచ్‌వీవీఏవీ స్వామి ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఒకటో డిపో గ్యారేజ్‌లో డిపో, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు స్వామి దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర నాయకులు చింతాడ వెంకటరావు, ఒకటో డిపో సీఐ వి.రమేష్, ఏఎంఎఫ్ రాజు, ఏడీసీలు, యూనియన్ నాయకులు జి.త్రినాథ్, ఎస్.వి.రమణ, జయదేవ్, విక్రమ్, సనపల శ్రీనివాసరావు, ఎస్.వి.రావు, గ్యారేజీ సిబ్బంది పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు



సన్మాన గ్రహీతలతో అదనపు ఎస్పీ కె.వి.రమణ

శ్రీకాకుళం క్రైమ్ : సుదీర్ఘ కాలం అంకితభావం , నిబద్ధతతో సేవలందించడం, ఎక్కడా రాజీ పడకుండా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించడం పోలీసులకే సాధ్యమని అదనపు ఎస్పీ కె.వి.రమణ అన్నారు. ఉద్యోగ విరమణ పొందిన పోలీసులను శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. సన్మానం పొందినవారిలో స్పెషల్ బ్రాంచి ఎస్‌ఐ కె.మన్మథరావు, ఆమదాలవలస ఏఎస్‌ఐ కె.శ్రీనివాసరావు, అసిస్టెంట్ రిజర్వ్ ఎస్‌ఐలు వై.జగన్నాథరావు, ఎ.శ్యామలరావు, కానిస్టేబుల్ వై.శ్రీనివాసరావు ఉన్నారు.

సమ్మెకు సంఘీభావం



సంఘీభావం ప్రకటిస్తున్న కాంగ్రెస్ నాయకులు

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం మున్సిపల్ కార్యాలయం వద్ద పారిశుద్ధ్య కార్మికులు, మిగతా విభాగాల మున్సిపల్ ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మెకు డీసీసీ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు శనివారం సంఘీభావం తెలియజేశారు. మున్సిపల్ ఉద్యోగుల ప్రధాన డిమాండ్లను తీర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కేవీఎల్ఎస్ ఈశ్వరి, సైదుల్లాఖాన్, చాంద్ బాషా, అంబటి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఎదురుచూపులు ఎన్నాళ్లో!

సామాజిక పింఛన్ల విషయంలో కూటమి ప్రభుత్వం సామాన్యులను తీరని వేదనకు గురిచేస్తోంది. అన్ని అర్హతలు ఉన్నా కొత్త పింఛన్లు మంజూరు చేయకుండా తీవ్ర జాప్యం చేస్తోంది. దీనికితోడు గత ప్రభుత్వంలో మంజూరైన పింఛన్లను రాజకీక్ష కక్షతో తొలగిస్తూ అనేక మందిని క్షోభకు గురిచేస్తోంది. ఈ విషయమై బాధితులు గ్రీవెన్స్‌సెల్, కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా పునరుద్ధరణ చేయకుండా ఇబ్బందులు పెడుతోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పార్టీలకు అతీతంగా పింఛన్లు మంజూరు చేసేవారు. అర్హతే ప్రాతిపదికగా వలంటీర్‌కు పత్రాలు అప్పగిస్తే నేరుగా సచివాలయంలోనూ పింఛన్ మంజూరయ్యేది.



- మంజూరుకాని కొత్త పింఛన్లు
- కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న అర్హులు
- పట్టించుకోని పాలకులు
- అతీగతి లేని 50 ఏళ్లకే పింఛన్ హామీ



ఎచ్చెర్ల క్యాంపస్/జి.సిగడాం/శ్రీకాకుళం రూరల్/గార :

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సామాజిక పింఛన్లు పక్కాగా అమలు చేశారు. మంజూరు నుంచి పంపిణీ వరకు పకడ్బందీగా వ్యవస్థ కొనసాగేది. సామాజిక పింఛన్ల అర్హులను గుర్తించి వలంటీర్లు లబ్ధిదారుల ఇంటికే వెళ్లి పింఛన్లు అందజేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితి మారిపోయింది. బీసీలకు 50 ఏళ్లు దాటగానే పింఛన్ ఇస్తామని హామీ ఇచ్చినా అధికారంలోకి వచ్చాక ఆ మాటే మర్చిపోయారు. కొత్త ప్రభుత్వ ఏర్పాటై ఏడాదవుతున్నా ఒక్కసారిసైతం పింఛన్ల కోసం నోటిఫికేషన్ ఇవ్వ లేదు. దరఖాస్తులు స్వీకరించలేదు. స్పౌజ్ పింఛన్లదీ అదే పరిస్థితి. మరోవైపు దివ్యాంగులకు సదరం సర్వే నిర్వహించి భారీగా పింఛన్లు కోత విధించారు. మిగిలిన వారు వైకల్యం నిర్ధారణ కోసం ఆస్పత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎచ్చెర్ల నియోజకవర్గంలో గ్రామ సచివాలయాల్లో సుమారు 5000 మంది వరకు దరఖాస్తులు చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నారు. గీవెన్స్‌సెల్, ప్రజా ప్రతినిధులు నిర్వహిస్తున్న ప్రజా దర్బారుల్లో సైతం పింఛన్లు అందడం మంజూరు కావడం లేదంటూ వినతిపత్రాలు అందిస్తున్నారు. అయినా ఫలితం లేకపోతోంది. ఎచ్చెర్ల నియోజకవర్గంలో 2024 ఎన్నికలకు ముందు 46,401 పింఛన్లు అందజేసేవారు. ప్రస్తుతం 42,785 పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. అంటే 3616 పింఛన్లు తగ్గాయి. ఏటా పెరగాల్సిన పింఛన్లు తగ్గుతుండటంపై లబ్ధిదారులు గగ్గోలు పెడుతున్నారు.

కొత్త పెన్షన్లకు నోచాన్స్..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా శ్రీకాకుళం రూరల్ మండలంలో కొత్త పెన్షన్ల కోసం ఒక్క దరఖాస్తు స్వీకరించిన దాఖలాలు లేవు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా బీసీలకు 50 ఏళ్లకు కొత్త పింఛన్లు మంజూరు కాలేదు. కూటమి పాలకులు స్పందించి పింఛన్లు మంజూరు చేయాలని అర్హులు కోరుతున్నారు.

పండుటాకుల ఎదురుచూపు..

పింఛన్లు మంజూరు కోసం గార మండలంలో వేలాది మంది వృద్ధులు ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వ హాయంలో 60 ఏళ్లు దాటగానే వలంటీరు ఆ లబ్ధిదారుని ఇంటివద్దకు వెళ్లి వివరాలను అప్‌లోడ్ చేసేవారు. ప్రతీ ఏడాది జూన్, డిసెంబర్‌లో వీరికి పింఛన్లు మంజూరు చేసేవారు. కుల,మత, పార్టీ, జెండా చూడకుండా అర్హులైన ప్రతీ ఒక్కరికీ అందేవి. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా ఇంతవరకు ఒక్క పింఛన్ కూడా మంజూరు కాలేదు. గతేడాది మే నెలలో 10,696 పింఛన్ లబ్ధిదారులుండగా, ఈ నెలలో 10,390 మందికి మాత్రమే పంపిణీ జరుగుతోంది. ప్రతి నెలా ప్రభుత్వం ఆదాయం మిగుల్చుకునేందుకు ప్రయత్నం చేస్తుంది తప్పా కొత్తవారికి ఇవ్వడం లేదు.



పింఛన్లు పంపిణీ చేస్తున్న సచివాలయ సిబ్బంది



వైఎస్సార్ సీపీ పాలనలో ఆస్పత్రిలో ఉన్న రోగి వద్దకు వెళ్లి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ (ఫైల్)

మండలం	సామాజిక పింఛన్ లబ్ధిదారులు
ఎచ్చెర్ల	12,342
రణస్థలం	11057
లావేరు	10778
జి.సిగడాం	8608
ఈ నెలలో పంపిణీ చేస్తున్న పింఛన్లు	42,785
2024లో వైఎస్సార్ సీపీ హయాంలో పంపిణీ చేసిన పింఛన్లు	46,401
తగ్గిన పింఛన్లు	3616

ఆదేశాలు రాలేదంటున్నారు..



నా వయస్సు 60 ఏళ్లు పైబడే. పెన్షన్ కోసం సచివాలయంలో దరఖాస్తు చేసుకునేందుకు వెళ్తే పైనుంచి ఎటువంటి ఆదేశాలు రాలేదని చెబుతున్నారు. పాలకులు స్పందించి పింఛన్ మంజూరు చేయాలి.

– ఆర్.తంబు, బైరివానిపేట, శ్రీకాకుళం రూరల్ మండలం

ఎప్పుడు మంజూరవుతుందో..



నా భర్త మృతి చెందిన తరువాత నాకు పింఛన్ మంజూరు చేయలేదు. నెలల తరబడి గ్రామ సచివాలయం చుట్టూ తిరుగుతున్నా మంజూరు కావడం లేదు. నేను నిరుపేదను. రోజు కూలీ చేస్తు బతుకుతున్నాను. ప్రభుత్వం స్పందించి పింఛను మంజూరు చేయాలి.

– ఎన్ని ప్రభావతి, ఎచ్చెర్ల

నోటిఫికేషన్ రాలేదంటున్నారు



వృద్ధాప్య పింఛన్ కోసం గ్రామ సచివాలయానికి దరఖాస్తు చేసుకునేందుకు అనేక సార్లు వెళ్లాను. నోటిఫికేషన్ వస్తే దరఖాస్తు చేసుకోవాలని అంటున్నారు. ఎప్పుడు నోటిఫికేషన్ ఇస్తారో తెలియదని అంటున్నారు. నేను నిరుపేదను. వృద్ధాప్యంలో కూలి పని చేయటం సైతం సాధ్యం కావటం లేదు. పింఛను మంజూరు చేసి ఆదుకోవాలి.

– దాసరి అప్పారావు, బొంతలకోడూరు

భర్త మృతి చెందినా..



నా భర్త మరణించి సుమారుగా ఏడాదవుతోంది. ఇంత వరకు నాకు పింఛన్ మంజూరు చేయలేదు. ఎన్నోసార్లు వినతిపత్రాలు అందించినా ఎవరూ స్పందించడం లేదు. నాకు ప్రతినెలా మందుల కోసం సమారు రూ.3వేలు ఖర్చవుతోంది.

– హనుమంతు తవిటమ్మ, దవళపేట, జి.సిగడాం మండలం

ఎలా బతికేది?



పింఛన్ కోసం అధికారుల చుట్టూ తిరిగి తిరిగి అలిసిపోయాం. ఎన్ని వినతిపత్రాలు ఇచ్చినా ఇంత వరకు ప్రభుత్వం ఒక్క పింఛున్ కూడా మంజూరు చేయలేదని అధికారులు చెబుతున్నారు. మాలాంటి పేదలు ఎలా బతకాలి?

– వడిశ లక్ష్మి, విజయరాంపురం, జి.సిగడాం మండలం

దాతే దిక్కు..



నాకు ఉండటానికి ఇల్లు లేదు. నా వయస్సు 85 సంవత్సరాలు. భర్త మృతి చెందిన కూటమి ప్రభుత్వం పింఛన్ మంజూరు చేయడం లేదు. మా గ్రామానికి చెందిన పేడాడ శ్రీరామమూర్తి సొంత నిధులతో ప్రతి నెలా రూ.4వేలు ఇంటికి తెచ్చి ఇస్తున్నారు. ఆయనే నాకు పెద్ద దిక్కు.

– పేడాడ కృష్ణవేణి, దవళపేట, జి.సిగడాం మండలం

ఘనంగా రామాలయ శంకుస్థాపన



భూమిపూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, గ్రామస్తులు

ఎచ్చెర్ల : లావేరు మండలం లింగాలవలసలో శనివారం సీతారామాలయ నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ హాజరై భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా తనవంతుగా రూ.50 వేలు విరాళంగా అందించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు కిరణ్‌ను సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లుకలాపు శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ వాల్లే దాలినాయుడు, అనిల్‌కుమార్, సుధీర్, బలరాం, చిన్న శ్రీనివాసరావు, సూర్యారావు పాల్గొన్నారు.

తమ్మినేని పరామర్శ



ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలం ఇబ్రహింబాద్‌లో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సనపల నారాయణరావును సోదరుడు గోవిందరావు ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం శనివారం పరామర్శించారు. నాయకులు దుంపల రామారావు, సువ్వారి గాంధీ, కోట గోవిందరావు, ఎన్ని ధనుంజయ, కంది నాని పాల్గొన్నారు.

అసిరితల్లి ఉత్సవ నిర్వహణపై సమావేశం నేడు

అరసవల్లి : అరసవల్లి – ఖాజీపేట గ్రామదేవత అసిరితల్లి అమ్మవారి సంబరాలు వచ్చే ఏడాది నిర్వహించేందుకు ఆదివారం సాయంత్రం 5 గంటలకు ఆలయం వద్ద గ్రామపెద్దలతో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. 2016 తర్వాత జరిగే ఈ పండగకు సంబంధించి కీలక అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు.

చోరీ కేసులో నిందితుడికి రిమాండ్

శ్రీకాకుళం క్రైమ్: నగర పరిధిలోని బాకర్‌సాహెబ్ పేటకు చెందిన బంటుపల్లి భానుప్రకాష్ ఇంట్లో గత నెల 28న జరిగిన చోరీ రూ.25 వేలు మాయమైన ఘటనలో విశాఖపట్నం జిల్లా పెద్ద వాల్తేరు జాలరిపేటకు చెందిన మజ్జి జశ్వంత్ కుమార్ అనే వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు రెండో పట్టణ సీఐ ఈశ్వరరావు శనివారం తెలిపారు. చోరీ ఘటనలో మరో వ్యక్తికోసం గాలిస్తున్నట్లు తెలిపారు. జశ్వంత్‌కుమార్‌పై విశాఖలో గంజాయి, దొంగతం, హత్యాయత్నం తదితర కేసులు ఉన్నట్లు గుర్తించామన్నారు.

మాలతికి డాక్టరేట్ పట్టా



ఎచ్చెర్ల క్యాంపస్: ఎస్ఎంపురం గ్రామానికి చెందిన సనపల మాలతికి డాక్టరేట్ పట్టా లభించింది. ఆంధ్ర విశ్వ విద్యాలయం జంతు శాస్త్ర విభాగం అధ్యాపకురాలిగా పనిచేస్తున్న ఆమె వర్సిటీకి చెందిన యు.షమీమ్ పర్యవేక్షణలో విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల్లో డమ్మిస్టిక్ రూమినెంట్లు (ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు) నుంచి సేకరించిన పరాన్నజీవులపై పరిశోధనకు గాను డాక్టరేట్ పట్టాను అందజేశారు.

పింఛన్ల పంపిణీ పరిశీలన

రణస్థలం: సామాజిక పింఛన్లను లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి అందజేస్తున్నట్లు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్‌డబ్ల్యూఎస్ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్ అన్నారు. రణస్థలం మండలం బంటుపల్లి పంచాయతీలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె పండుగ బిల్లులు రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రూ. 2,200 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, మరో పదిరోజుల్లో విడుదల చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బాబా ఆలయ వార్షికోత్సవం



జి.సిగడాం: పెంట గ్రామంలో షిరిడీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవాలు శనివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. సాయినామ స్మరణతో గ్రామం హోరెత్తింది. గురువులు అమ్ముల సాంబశివరావు ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వెల్ఫేర్ సెక్రటరీని దూషించడం దారుణం



బుక్కూరు ఉమామహేశ్వరరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మహానాడుకు జనం తరలింపు విషయమై అనంతపురం కార్పొరేషన్ 30వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి రాజేష్‌నాయుడు 29వ వార్డు సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీ అశ్వత్‌రెడ్డిని దూషించడం దారుణమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్స్ జనరల్ సెక్రటరీ బుక్కూరు ఉమామహేశ్వరరావు అన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు బానిసలు కాదని, ఈ ఘటనపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వెన్నుపోటు దినం విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎం.వి.పద్మావతి

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా ప్రజలకు చేసింది శూన్యమని, దీనికి నిరసనగా జూన్ 4న వెన్నుపోటు దినం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు ఎం.వి.పద్మావతి అన్నారు. ఈ మేరకు నగరంలోని మండలవీధిలో శనివారం వైఎస్సార్‌సీపీ పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రతి నెలా సంక్షేమ క్యాలెండర్ అమలయ్యేదని, క్రమం తప్పకుండా ప్రజలందరికి సంక్షేమ పథకాలు అందేవని గుర్తు చేశారు. సంక్షేమ పాలనకు చరమగీతం పాడి ప్రజలకు మోసగించిన కూటమి పాలన వైఫల్యాలను ప్రతి ఒక్కరికి తెలిసేలా పార్టీ నాయకులంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. శ్రీకాకుళం నగరంలో 50 డివిజన్ల వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజలంతా స్వతహాగా కూటమి పాలన మోసాల్ని వ్యతిరేకిస్తూ జూన్ 4 వెన్నుపోటు దినం కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు. సమావేశంలో పార్టీ ముఖ్య నాయకులు సాధు వైకుంఠరావు, రొత్తు శంకరరావు, ఎంఎ రఫీ, టి.కామేశ్వరి, సీపాన రామారావు, దుంగ సుధాకర్, ఎండ రమేష్, కింజరాపు రమేష్, ఎండ రమేష్, గద్దిబోయిన కృష్ణయాదవ్, తారక్ తదితరులు పాల్గొన్నారు.

గుక్కెడు నీటి కోసం..!



శ్రీకాకుళం రూరల్ మండల పరిధిలోని పెదపాడులో మంచి నీటి కష్టాలు వెంటాడుతున్నాయి. రోజు కోసారి వచ్చే ట్యాంకర్ వద్ద మహిళలు పాట్లు పడుతున్నారు. జాతీయ రహదారి సర్వీసు రోడ్డుపై అనుకుని ప్రమాదకర పరిస్థితుల్లో బిందెలు, బకెట్లలో నీటిని పట్టుకోవాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

ఘనంగా సీతారామ ఆలయ వార్షికోత్సవం



లావేరు మండలం తాళ్లవలసలో షిర్డీసాయి లక్ష్మీ గణపతి సహిత సీతారామ ఆలయ 10వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. పండితులు జంధ్యాల ప్రసాద్ శర్మ నేతృత్వంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. అనంతరం కమిటీ సభ్యులు స్వామివారికి పట్టు వస్త్రాలు, పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. - ఎచ్చెర్ల

వెంకన్నకు అలంకరణ



చిన్నబజారులోని దూదివారి వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుప్రభాతసేవ, అష్టోత్తర శతనామాలు, భక్తుల గోత్రనామాలతో పూజలు జరిగాయి. స్వామివారికి ప్రత్యేకంగా అలంకరించారు.

- శ్రీకాకుళం కల్చరల్